ప్రజాశక్తి

శుక్రవారం 18 నవంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

చలిరేగుతోంది..!

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి




గుంటూరులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో మంచు ప్రభావంతో ఉదయం లైట్లతో ప్రయాణిస్తున్న వాహనాలు



అడవితక్కెళ్లపాడులో రాజీవ్ గృహ కల్ప అపార్టుమెంట్లను ఉదయం వేళ కమ్మేసిన మంచు

చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గుతోంది. 15 రోజులుగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చలి ఎక్కువవుతోంది. రాత్రి 12 గంటల నుంచి మంచు కూడా పడుతోంది. ఈ క్రమంలో వినియోగం తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడింది. ఉమ్మడి జిల్లాలో రోజుకు 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవసరం కాగా ప్రస్తుతం 15 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాకు కేటాయిస్తున్న కోటా సరిపోతోంది. సహజంగా వేసవిలో 20 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం ఉంటుంది. వేసవిలో కేటాయింపులు 17 మిలియన్ యూనిట్లు కావడం వల్ల కోతలు అనివార్యం అవుతున్నాయి. ప్రస్తుతం వినియోగం తగ్గడం వల్ల కోతలేమీ లేకుండా నిరాటకంగా సరఫరా చేస్తున్నారు. చలి తీవ్రత వల్ల రాత్రి వేళ ఎసిలు, కూలర్లు వినియోగం కూడా తగ్గింది. జిల్లాలో రాత్రి పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 31 డిగ్రీలు నమోదు అవుతుండగా రాత్రి వేళ 20 నుంచి 21 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు చలి తీవ్రత ఉంటోంది. రాత్రి 9 గంటల కల్లా ప్రజలకు ఇళ్లకు చేరుతున్నారు. ఉదయం 7 గంటల తరువాత భానుడు కన్పిస్తున్నాడు. ఉదయాన్నే

2లో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు తదితరులు

రైతు సమస్యలపై నిత్య పోరాటాలు

- గుంటూరులో రెండ్రోజుల పాటు ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు
- రేపు రాష్ట్ర సదస్సు - ముఖ్య వక్తగా హన్నన్ మొల్లా
- జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - నరసరావుపేట

రైతుల సమస్యల పరిష్కారం, రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు రైతు సంఘం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తోందని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవకర్గం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఈ నేపథ్యంలోనే ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు గుంటూరులో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే జమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.బాలకృష్ణ, వై.గోపాలరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావుతో కలిసి గురువారం ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, అయితే ప్రభుత్వాలు మాత్రం వారిని విస్మరిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ రంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభ పరిస్థితి,

2లో

మూర్ఛ వ్యాధిపై అవగాహన పెంచుకోండి

ప్రజారోగ్య వేదిక సభలో ప్రముఖ న్యూరో ఫిజీషియన్లు, సర్జన్లు - జిజిహెచ్‌లో సదస్సు

8 లో

రుణ యాప్‌ల జోలికి వెళ్లద్దు

డిఐజి త్రివిక్రమవర్మ

8 లో

రైల్వే ట్రాక్ పక్కన మృతదేహాలు

అనుమానాస్పద స్థితిలో తల్లీకూతుళ్లు మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల



తల్లీకూతుళ్ల మృతదేహాలు

రైలు నుండి పడి తల్లీకూతులుళ్లు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని గురిజవోలు సమీపంలో గురువారం వెలుగు చూసింది. దీనిపై రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. గురిజవోలు - నుదురుపాడు గ్రామాల మధ్య రైల్వే ట్రాక్‌పై గ్యాంగ్‌మెన్ తన విధుల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున 3 గంటలకు ట్రాక్ తనిఖీలకు వెళ్లాడు. ఆ సందర్భంలో గురిజవోలు సమీపంలో ట్రాక్ వెంబడి 25 ఏళ్ల మహిళ, నాలుగేళ్ల చిన్నారి పాప మృతదేహాలు పడి ఉండడం గమనించి వెంటనే రైల్వే పోలీసులకు సచాచారం ఇచ్చారు. అంతకు గంట, రెండు గంటల మందు

2లో


పన్ను విధింపులో నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఇద్దరు అడ్మిన్ సెక్రెటరీల సస్పెన్షన్‌కు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

అనేకసార్లు అర్జీ ఇచ్చినా వినియోగంలో ఉన్న అసెస్‌మెంట్లకు పన్ను విధింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ ఛాంబర్‌లో అండర్ అసెస్మెంట్, అన్ అసెస్మెంట్ ద్వారా పన్ను విధింపు, ఆర్.ఆర్. యాక్ట్ అమలు, షాప్స్ లీజులు, నీటి కుళాయిల సర్వే, రెవెన్యూ కోర్ట్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులుతో సమీక్షించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా గత సమావేశం నుండి ఇప్పటి వరకూ అండర్ అసెస్మెంట్, అన్ అసెస్మెంట్‌ల పన్ను విధింపు

2లో




మాట్లాడుతున్న కమిషనర్

పేదలను క్రీడలకు దూరం చేయొద్దు

- స్టేడియాల లీజు నిర్ణయం ఉపసంహరించుకోవాలి
- బిఆర్ సేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌కు డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-గుంటూరు



చీఫ్ కోచ్‌కు వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

ప్రభుత్వ క్రీడా మైదానాలను, ఇండోర్ స్టేడియాలను, క్రీడా వికాస కేంద్రాలను ప్రైవేటు వారికి లీజుకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న కోరారు. ఈ మేరకు బి.ఆర్.స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌కు డివైఎఫ్ఐ నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జి.రామన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 'పే అండ్ ప్లే' పేరుతో ప్రైవేటు కాంట్రాక్టర్లుకు ఇండోర్ స్టేడియాలను లీజుకు ఇవ్వటం వల్ల డబ్బులున్న వారే ఆటలు ఆడే పరిస్థితి వస్తుందని, పేద వారు క్రీడలకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే

2లో

రైతు సమస్యలపై నిత్య పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సమస్యలపై జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో చర్చిస్తారన్నారు. ఈ సందర్భంగా 19వ తేదీన 'వ్యవసాయ రంగం సంక్షోభం-మద్దతు ధరల చట్టం-ప్రభుత్వ విధానాలు' అంశంపై రాష్ట్ర సదస్సు ఉంటుందని తెలిపారు. సదస్సుకు ప్రధాన వక్తగా నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్‌మొల్లా హాజరవుతారని తెలిపారు. ఎఐకెఎస్ అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలే, సహాయ కార్యదర్శి విజూకృష్ణన్ తదితరులు ప్రసంగిస్తారన్నారు.

పల్నాడు జిల్లాకు మణిహారమైన వరికపూడిశెల ప్రాజెక్టు పల్నాడు ప్రజల చిరకాల స్వప్నమని, ఇది పూర్తికావాలని 60 ఏళ్ల నుండి ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల వెల్దుర్తి, బొల్లాపల్లి, మాచర్ల, దుర్గి, పుల్లలచెరువు మండలాల్లో 80 వేల ఎకరాలకు పైగా సాగునీరు, 100 గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని, దీనిపై తాను శాసన మండలిలో ప్రస్తావించానని చెప్పారు. ఇప్పటికైనా త్వరితగతిన తీసుకుని నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట అయిన మిర్చి గతేడాది 1.60 లక్షలు ఎకరాల్లో తామర తెగులు సోకి పూర్తిగా దెబ్బతింటే నష్టపరిహారం ఇవ్వలేదని, కనీసం నివేదికలైనా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించలేదని విమర్శించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో మిర్చికి ఎకరాకు వైఎస్‌ఆర్ పంటల బీమా కింద రూ.48 వేలు నష్టపరిహారం ఇచ్చినా పల్నాడు జిల్లాకు మాత్రం మొండిచేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అధిక వర్షాలకు పత్తి, మిర్చి పైర్లు దెబ్బతిన్నాయని, వీరికీ పరిహారం కోసం తాను జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో కోరానని అన్నారు. జిల్లాలో లక్ష మందికి పైగా కౌలు రైతులుంటే 39 వేల మందికే గుర్తింపు కార్డులిచ్చారని, వారిలోనూ 3600 మందికి పంట రుణాలు ఇచ్చారని తెలిపారు. అర్హులందరికీ గుర్తింపు కార్డు, రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గోపాలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో నకిలీ, కల్తీ, నాసిరకం విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంటితుడుపు చర్యలతో నకిలీలను అరికట్టలేరని చెప్పారు. ధాన్యం కొనుగోలులో 20 శాతం తేమ నిబంధన వల్ల చిన్న, సన్నకారు రైతులతోపాటు కౌలురైతులు తీవ్రంగా నష్టపోతారని, తేమ శాతం తగ్గించి పంట కోసే సమయంలోనే సోలార్ డ్రయ్యర్స్ పద్ధతి అందుబాటులోకి తెచ్చి పంట నాణ్యత పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు పిచికారి యంత్రాలు, టార్పాలిన్ పట్టాలు, సూక్ష్మ సేద్యానికి అవసరమైన పరికరాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పిన సరిపడా అందుబాటులో ఉంచడం లేదని విమర్శించారు. ఎరువులపై ఉన్న రాయితీలు తగ్గించి క్రిమిసంహారక మందుల మీద నియంత్రణలు లేకపోవడంతో గతంలో ధరలు భారీగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రిమిసంహారక మందులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని, ధరలను నియంత్రించి రైతులను ఆదుకోవాలని కోరారు.

పేదలను క్రీడలకు దూరం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

క్రీడల్లో మన రాష్ట్రం వెనపడిందని, ఈ స్థితిలో క్రీడా రంగానికి నిధులు కేటాయించి ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం, తమ బాధ్యత నుండి వైదొలగి క్రీడా మైదానాల మీద, స్టేడియాల మీద డబ్బు సంపాదించాలని చూడటం దారుణమని అన్నారు. లీజుల వల్ల క్రీడాకారులపై ఫీజు, సామగ్రి ఛార్జీల భారం, వసతి భారం పడుతుందన్నారు. ఇప్పటికే క్రీడాభిమానులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు లేఖలు రాసినా శాప్ నుంచి స్పందనేమీ లేకపోవడం సోచనీయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా క్రీడా బడ్జెట్‌లో నిధులు కేటాయించి క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క గ్రామాల్లో సైతం క్రీడలు నిర్వహించాలని క్రీడోత్సవాలకు ప్లాన్ చేస్తుందని, మరోపక్క స్టేడియాలను లీజుల పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, ఆదాయం పొందాలని చూస్తోందని, ఇది ప్రభుత్వ ద్వంద వైఖరికి అద్ధం పడుతోందని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కిరణ్, అఖిల్, చందు ఉన్నారు.

20న మార్కండేయ ఎడ్యుకేషనల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మంగళగిరి

ఈనెల 20వ తేదీ ఉదయం10 గంటలకు మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 39వ వార్షికోత్సవ వేడుకలను మార్కండేయ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లుగా సొసైటీ కార్యదర్శి పి.రాజశేఖర్ గురువారం తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా పేద విద్యార్థులకు సొసైటీ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

తూకం ప్రకారం బయోమెడికల్ వ్యర్థాల సేకరణ

ప్రజాశక్తి-తెనాలి

బయోమెడికల్ వేస్ట్‌ను ఆసుపత్రిలో బెడ్స్ తదితర అంశాల ప్రాతిపదికన కాకుండా వేస్ట్ బరువు ప్రకారం చార్జిలు విధించి సేకరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షులు డాక్టర్ జె.కోటినాగయ్య కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గతంలో కమిషనర్, సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన వైద్యుల బృందం గురువారం డిఎస్పీ కె స్రవంతిరాయ్‌ను కలిసి పరిస్థితిని వివరించి, వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ జాయింట్ సెక్రటరీ వి.పవని ప్రియాంక, డాక్టర్ వి.శేషగిరిరావు, డాక్టర్‌చందు సాంబశివుడు, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఈవూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



టిడిపి నాయకులకు చెబుతున్న బూసి ఆదిమ్మ

రెండేళ్ల నుంచి పింఛను రావడం లేదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రెండేళ్ల నుంచి తనకు పింఛన్ రావడం లేదని ఓ వృద్ధురాలు బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి నాయకులలకు మొర పెట్టుకుంది. గురువారం మండలంలోని గొట్టిపాడులో గింజపల్లి శివరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నా బాధ చూడండి అయ్యా... నాకేనా పింఛన్ తీసేసిదంటూ విలపించింది. దీంతో స్పందించిన గ్రామ సర్పంచ్ పత్తిపాటి మరయరాణి అధికారులతో మాట్లాడి పింఛను వచ్చేలా చూస్తానని హామి ఇచ్చింది. కార్యక్రమంలో రైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజపల్లి వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సాధినేని వీరయ్య, ఆలపాటి పాండు, సుబ్బారావు, ఎస్.నవీన్,ఎస్‌సి సెల్ పీటర్‌పాల్ పాల్గొన్నారు.

'చలి'రేగుతోంది..!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ పనులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లే వారు స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించి వెళ్లక తప్పడం లేదు. ఉదయం 7 గంటల వరకు రహదారులపైకి ప్రజలు రావడం లేదు. వాకర్స్ కూడా గతంలో ఐదు గంటలకు ప్రారంభించే నడకను ఇప్పుడు ఆరు గంటల తరువాత ప్రారంభిస్తున్నారు. ఆస్మా, ఇతర సమస్యలు ఉన్న వారు సాయంత్రం వాకింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

చలికి బాలింతలు, శిశువులు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నుమోనియా వ్యాధిగ్రస్తుల మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రతతో పాటు జిల్లాలో దోమల బెడద కూడా పెరుగుతోంది. గత నెల వరకు విస్తారంగా వర్షాలు కురవడం వల్ల లార్వా ఉత్పత్తి పెరిగి దోమల పెరుగుదల అధికంగా ఉంటోంది. చలి కాలం వల్ల దోమల ఉత్పత్తికి కూడా అవకాశం పెరుగుతోంది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. చలి తీవ్రతతో స్వెట్టర్లు, మఫ్‌లర్లకు డిమాండ్ పెరిగింది. ఉన్ని దుస్తుల వినియోగం కూడా అధికమైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ వసతి గృహాల్లో దుప్పట్లు, రగ్గులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రహదారుల పక్కన నిద్రించే అభాగ్యులు, అనాథలకు కూడా దుప్పట్లు, రగ్గులులేక చలిలోనే ముడుచుకుని బస్ షెల్టర్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాల్లోని ఖాళీ ప్రదేశాల్లో నిద్రిస్తున్నారు. మరోవైపు చలి తీవ్రతతో ఐస్‌క్రీం పార్లర్లు, చెరకు రసం స్టాల్స్, శీతల పానియాలు, జ్యూస్ స్టాల్స్ వ్యాపారం మందగిస్తోంది.

ప్రకృతి విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పడే వివిధ రకాల ప్రకృతి విపత్తుల నుండి రక్షణ కలిగి ఉండేదుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృదం పేర్కొంది. గురువారం స్థానిక చేబ్రోలు పంచాయతీ వద్ద ఎన్‌డిఆర్‌ఫ్ బృందం ప్రకృతి విపత్తులపై అవగాహన సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారాఇ బి. బాబురావు మాట్లాడుతూ తుఫానులు, వరదలు, భూకంపాలు, సిలిండర్ పేలడం,ఎక్కువమంది హాజరైనచోట తొక్కిసలాట జరిగినప్పుడు , జన , పశు ప్రాణ నష్టాల నియంత్రణకు చర్యలు ఏ విధంగా పాటించాలో గ్రామ వాలంటీర్లకు , సచివాలయ సిబ్బందికి ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ సిఇఓ శ్రీనివాసరెడ్డి ,ఈటిసి బాపట్ల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కుక్కిలిగడ్డ సాహితీ, మండలంలోని అందరూ ఎంపిటీసీ సభ్యులు, ఈఓపి ఆర్‌అండ్‌ఆర్‌డి జి. శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రాలు అందజేస్తున్న వల్లభనేని వెంకటరావు

తాడేపల్లి 14వ వార్డులో 'బాదుడే బాదుడు'

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణ పరిధిలోని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ముగ్గురోడ్డు 14వ వార్డులో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు కార్యకర్తలతో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ జగన్ ప్రభుత్వం పెంచిన నిత్యావసర ధరలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు,సిహెచ్ శివుడు,యస్సి సెల్ అధ్యక్షులు పీటర్ పాల్, మంగళగిరి నియోజకవర్గ మహిళా కార్యదర్శి కళ్యాణి,నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి నాగుల్ మీరా, నక్క నవీన్ రాజా,మంగళగిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, గోలి సౌరి, ,ఇట్టా పెంచలయ్య, చిన్న పోతుల చిన్న, పట్టణ టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు కంభం సాయిచంద్, దర్శి హరికృష్ణ, మహిళా అధ్యక్షురాలు ఎ.కుసుమ,తెలుగు యువత అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, బి.రమేష్, అంకాలరావు, వి.నవీన్, రాజు,బయమ్మ, మేరమ్మ,మేరీ, మరియమ్మ, జ్యోతి, సీహెచ్.జ్యోతి, పి.శ్రీనివాస్‌రావు, డి. దుర్గారావు,బి.రామకృష్ణ,శివ ప్రసాద్,చెన్నారావు పాల్గొన్నారు.



మాటిచ్చిన 24 గంటల్లో రోడ్డు

ప్రజాశక్తి-తాడేపల్లి

బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన ఉండవల్లిలో పర్యటించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఉండవల్లిలోని పుష్కర కాలనీ ప్రజలు తమ రోడ్ల పరిస్థితిని వివరించారు. సమస్యకు స్పందించిన లోకేష్ 48 గంటల్లో రోడ్డు సమస్య పరిష్కారంపై హామీ ఇచ్చి 24 గంటలు పూర్తికాకముందే పోలకంపాడు దేవునిమాన్యం ప్రాంతంలో ఏడు రోడ్లు వేయించారు. జంగిల్ క్లియరెన్స్, గుంతల పూడ్చివేత, చిప్స్ పరిచి ప్రజలు తిరిగేందుకు విలుగా రహదారులు ఏర్పాటు చేశారు. ఇచ్చిన హామీ నెరవేర్చడంతో స్థానికులు నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను విధింపులో నిర్లక్ష్యంపై ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, క్షేత్ర స్థాయి పర్యటనలో పన్ను విధింపులో నిర్లక్ష్యంగా ఉన్న పొన్నూరు రోడ్డులోని 27, చౌడవరంలోని 191 వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులను సస్పెండ్ చేయాలన్నారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసి, అడ్మిన్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఒలు క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యదర్శులు విధిగా పని వేళల్లో అందుబాటులో ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం యునిఫారం, ఐడి కార్డ్ ధరించాలని స్పష్టం చేశారు. నివాసేతర భవనాలకు విధిగా మీటర్ కుళాయిలు ఉండాలన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రతి ఇంటికి ఆస్తి, నీటి పన్ను అసెస్మెంట్ నంబర్‌ను పెయింట్ చేయించాలని ఎస్‌ఇని ఆదేశించారు. జిఎంసి షాప్స్ సబ్ లీజులు, మరణించిన లీజుదార్ల వివరాలు, రెన్యువల్స్, 25 ఏళ్లు నిండిన షాప్స్ ఆక్షన్స్‌కు సంబంధించి నివేదికలను రెవెన్యూ అధికారుల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఆర్‌ఒలు ప్రసాద్, బాలాజీబాష, రవికుమార్, పోలేశ్వరరావు, సూపరింటెండెంట్లు, ఆర్‌ఐలు, పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పక్కన మృతదేహాలు

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిన రైలు నుండి వీరు పడిపోయి ఉంటారని భావిస్తున్నారు.

అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతానికి చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమయ్యారనే కేసు రెండ్రోజుల కిందట నమోదైందని, వారి ఫొటోలూ అన్ని స్టేషన్లకూ వచ్చాయని పోలీసులు తెలిపారు. ఆ ఫొటోల ఆధారంగా ప్రస్తుతం చనిపోయిన ఇద్దరూ అదృశ్యమైన వారేనని, అయితే వీరిలో ఒకమ్మాయి గుత్తి వద్దే వీరి నుండి వేరై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాలను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు సమాచారాన్ని బంధువులకు ఇచ్చారు. వారొచ్చి మృతదేహాలను గుర్తిస్తే గాని మృతులు ఎవరనేది నిర్ధారణ కాదని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

రేపు కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ వార్షికోత్సవం

ప్రజాశక్తి తెనాలి

పట్టణానికి చెందిన కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ రేపల్లె శాఖ ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 19న రేపల్లెలోని శాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని చైర్మెన్ డిఎల్ కాంతారావు గురువారం తెలిపారు. ఖాతాదారులు, ఉద్యోగులు ఈ వేడుకలో పాల్గొనాలని ఆయన కోరారు.

వివాహిత అనుమానాస్పద మృతి



ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని భార్గవ పేటకు చెందిన వి.మానస(20) గురువారం అనుమానాస్పద మృతి చెందింది. చిన్న కాకాని గ్రామానికి చెందిన మానసకు రెండు సంవత్సరాల క్రితం భార్గవ్ పేటకు చెందిన వి మణికంఠతో వివాహం జరిగింది. వివాహం జరిగిన అప్పటినుంచి కుటుంబ కలహాలు జరుగుతూనే ఉన్నాయని తల్లి మహంకాళి తెలిపింది. మానస గురువారం ఉదయం ఇంట్లో అగ్ని ప్రమాదంలో కాలిపోయి ఉంది. వెంటనే కుటుంబ సభ్యులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా, ఎన్నారై వైద్యులు గుంటూరు జనరల్ హాస్పిటల్ కు పంపించడం జరిగింది. చికిత్స పొందుతూ మతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, మానసను కరెంట్ హీటర్ పెట్టి భర్త మణికంఠ, మృతురాలు అత్త, మరిది కలిసి చంపినట్లుగా ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలోని టీడీపీ కల్యాణ మండపం ఎదురు చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. , దాచేపల్లి నుంచి వస్తున్న ఆటోను పిడుగురాళ్ల వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పరు అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ సైదాల్లి(37) అక్కడిక్కడే మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కృష్ణానదిలో బయటపడిన మానవ కళేబరం

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సీతానగరం రైల్వే బ్రిడ్జి కింద ఇసుక తిన్నెల్లో గురువారం మానవ కళేబరం బయటపడింది. పూర్తిగా ఎముకల గూడులామారి బయటకు కనిపిస్తుంది. ఎము కల గూడు మహిళదా...పురుషుడిదా అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. ప్రమాదవశాత్తు జరిగిందా...లేక ఎక్కడైనా హత్యచేసి ఇక్కడ పూడ్చిఎట్టారా అనేది కూడా పోలీసుల పరిశీలనలో బయటపడే అవకాశం ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి :	28,767
మిర్చి ఎగుమతి :	28,206
మిర్చి నిల్వ :	10,230

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 26,500
నెం.5	18,500 - 27,000
273	20,500 - 23,300
341	15,400 - 26,000
4884	14,500 - 20,500
నాన్ ఎసి	
తేజ	8,500 - 23,000
బడిగి	9,500 - 27,500
దేవనూరు డీలక్స్	15,500 - 27,000
తాలుకాయలు	4,500 - 14,000
ఎసి	
334	12,500 - 27,000
నెం.5	26,500 - 27,000
341	22,500 - 27,000
తేజ	12,000 - 23,000
బడిగి	22,200- 28,000
దేవనూరు డీలక్స్	25,000 - 25,000
తాలుకాయలు	4,300- 12,000

పల్నాటి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలో ఆర్‌డిఒ అద్దయ్య

ప్రజాశక్తి - కారెంపూడి

ప్రపంచ చరిత్ర కలిగిన పల్నాటి వీరరాఘున ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత పల్నాటి ప్రాంత ప్రజలపై ఉందని గురజాల ఆర్‌డిఒ అద్దయ్య అన్నారు. ఉత్సవాల నిర్వహణపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. సమావేశానికి తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షత వహించగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్‌డిఒ అద్దయ్య మాట్లాడుతూ పల్నాటి చరిత్రను దేశ నలుమూలలకూ విస్తరింపజేయాలని, ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా కారెంపూడిలో మాత్రమే వీరులకు ఉత్సవాలు జరుగుతాయని అన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీఠం నిర్వాహకులు విజయ్‌కుమార్

ఉత్సవాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల్లోని వీరాచారవంతులు, ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొంటారని అన్నారు. ఉత్సవ నిర్వహణలో ఆటంకాలేమీ రాకుండా అధికారులు జాగ్రత్త వహించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చూసుకోవాలని చెప్పారు. ఆచారవంతులకు వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పేటసన్నెగడ్ల, కారెంపూడి గ్రామపంచాయతీల పరిధిలో పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. ఉత్సవ సందర్శకులకు తాగునీరు, వైద్యసదుపాయాలు, మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు వీల్లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో వీర్లగుడి పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకులు విజయ్‌కుమార్, ఎంపిపి ఎం.శారద శ్రీనివాసరెడ్డి, జెడ్‌పిటిసి షేక్ షఫీ, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, సిఐ జయకుమార్, ఎస్‌ఐ రామాంజనేయులు, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు కోటేశ్వరరావు వెంకటేశ్, ఇఒపిఆర్‌డి సత్యప్రసాద్, చెన్నకేశవ స్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ చల్లా ప్రసాద్, వైసిపి నాయకులు, సంస్థల ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.చంద్రశేఖర్, బి.అల్లయ్య, అక్బర్, సి.హెచ్. వెంకట కోటేశ్వరరావు, ఎం.సాంబశివరావు, జి.శీను పాల్గొన్నారు.


దిగుబడి అంచనా పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పత్తిలో దిగుబడి అంచనా ప్రయోగం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని అగ్నిగుండాలలో పత్తి దిగుబడి అంచనాపై గురువారం ప్రయోగం నిర్వహించారు. మొదటి తీత కింద ఎంపిక చేసిన పొలంలోని ఒక సెంటు విస్తీర్ణంలో పరిశీలించగా 1.6 కిలోల దిగుబడి వచ్చిందని నిర్ధారించారు. అనంతరం సస్యరక్షణ చర్యలపై రైతులకు మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు వివరించారు. ఎఎస్‌ఒ నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన ధనలక్ష్మి వ్యాయామ కళాశాల క్రీడాకారులకు బహుమతిని ఇస్తున్న ఎఎన్‌యు విసి పి.రాజశేఖర్ తదితరులు

బ్యాడ్మింటన్‌లో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-ఈపూరు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ అంతర్ కళాశాల పోటీల్లో మండలంలోని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన పురుషుల జట్టు ప్రథమ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ బహుమతిని అందజేశారన్నారు. విజేతలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఎం.సురేష్ కుమార్, ఆర్.బలరాం నాయక్, ఎం.దాసు అభినందించారు.

నేడు డివిజన్ స్థాయి చెకుముకి పోటీల

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలోని జన విజ్ఞాన వేదిక (జెవివి) కార్యాలయంలో చెకుముకి డివిజన్ స్థాయి పోటీలు శుక్రవారం నిర్వహిస్తామని జెవివి అధ్యక్షులు షేక్ ఫిరోజ్‌బాషా తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే పోటీల్లో రాజుపాలెం, మాచవరం, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మండలాలలో పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. డివిజన్ స్థాయిలో గెలుపొందిన వారికి డిసెంబర్ 10వ తేదీన పిడుగురాళ్లలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు.

దగ్ధమైన ఇంటిని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని చెంఘిజ్‌ఖాన్‌పేటలో విద్యుద్ఘాతం కారణంగా దగ్ధమైన పూరిల్లు, పశువుల కొట్టాన్ని యడ్లపాడు రెవెన్యూ అధికారులు గురువారం సందర్శించారు. బుధవారం మధ్యా హ్నం జరిగిన ఈ ఘటనలో తన ఇల్లు, గృహోపకరణాలు, విలువైన డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతైనట్లు అధికారుల ఎదుట బాధితుడు కె.పవన్‌కుమార్ వాపోయాడు. పరిశీలనలో ఎస్‌ఐ, తహశీల్దార్ తదితరులున్నారు.

క్రికెట్, ఖోఖో రాష్ట్ర పోటీలకు 'వాగ్దేవి' విద్యార్థులు

ప్రజాశక్తి - నరసరావుపేట


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కాలేజీ యాజమాన్యం

అండర్-19 ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి క్రికెట్, ఖోఖో పోటీల్లో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారుల అభినందన సభ కాలేజీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 15న చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో, పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఖోఖో పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారన్నారు. తమ కళాశాలలో విద్యతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఒ.నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, పి.కృష్ణారావు, ఐ.కృష్ణకిషోర్, పివి అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల అంజి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ -ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలోని సచివాలయంలో ఈ-ఆధార్ సేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక 6వ వార్డులోని నెమలిరెడ్డి బజారు సచివాలయంలో ఈ-ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పరిపాలనను గడప వద్దకు తీసు కుచ్చారని అన్నారు. వాలంటీర్ వ్యవస్థ వలన మరింత ప్రయోజనాలు జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండ దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం.కిరణ్‌కుమార్, కె.వాసుదేవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

4వ సెమిస్టర్‌లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఈనెల 16న విడుదల చేసిన 4వ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. బీఎస్సీ, బీకామ్‌కు సంబంధించిన అన్ని గ్రూపుల్లోనూ అత్యధిక మార్కులతో పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని అన్నారు. బీఎస్సీ (ఎంపిసి)లో పిల్లి కల్పన 800 మార్కులకు గాను 798 మార్కులు, బీఎస్సీ (ఎంఎస్‌సిఎస్)లో లంకోజి మాధవి 796 మార్కులు (99.75 శాతం) సాధించారని వివరించారు. ఆయా గ్రూపుల్లో దూదేకుల ఆశాబేగం, కోటపాటి దివిజ, షేక్ రజియా సుల్తానాభి, యేరువ గౌతమి, బొబ్బా లావణ్య, బెల్లంకొండ నాగవినయ్ కుమార్ 93.1 శాతం నుండి 98.1 శాతం వరకు మార్కులతో యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు అభినందించారు. అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యాబోధన వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిని కళాశాల డైరెక్టర్ నాసరయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె సతీష్‌బాబు, ఎం.బాలకోటేశ్వరరావు, షేక్ సర్దార్, జి.శివన్నారాయణ అభినందించారు.


విద్యార్థి యోగా ఆసనాలను చూస్తున్న కలెక్టర్ తదితరులు

చిన్ననాటి నుండే లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

విద్యార్థులకు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ సూచన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పిల్లలందరూ చిన్నప్పటి నుంచి చదువుతోపాటు వాళ్లకు ఇష్టమైన అదనపు అంశాలపై దృష్టి పెట్టి సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని హెఐఆర్‌డి పాఠశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పిల్లలంతా చిన్ననాటి నుండే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఉద్బోధించారు. ఆసక్తి ఉన్న రంగాల్లో పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదగొచ్చని అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. అలసత్వం వీడనాడాలన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌రెడ్డి చేసిన యోగ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. తిలక్, హేమ, సుహానా, సుహానా, నవ్య తదితరుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆలరించాయి. అనంతరం చైల్డ్ లైన్ సే దోస్త్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ అరుణ, సిడబ్ల్యూసి అధికారిని ప్రమీలరాణి, సుభాని, ప్రిన్సిపాల్ ఫాబి పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో నిర్వహజంచే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా

గుంటూరులో నిర్వహించే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

పలు ప్రాంతాల్లో విస్తృత సమావేశాలు, సభలు, వాహన ప్రచారం

ప్రజాశక్తి-పెదనందిపాడు

నవంబర్ 19, 20న జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా 19 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన్ మందిర్‌లో జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. గురువారం పెదనందిపాడు, కాకుమాను మండల రైతు సంఘాల విస్తృత సమావేశం పెదనందిపాడు లోని, విశ్రాంత ఉపాధ్యాయుల భవనంలో, కౌలు రైతు సంఘం నాయకులు కందుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉందని, పెట్టుబడులు ఎక్కువవుతున్నాయని, గిట్టుబాటు ధరలు లభించడం లేదని, ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. బ్యాంకులు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మద్దతు ధర గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వ్యవసాయ రంగం నిలదొక్కునేందుకు ఎమ్మెస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరారు, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు అప్రజాస్వామికంగా మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చారని, ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు, ఆహార ధాన్యాల పైన, పాల ఉత్పత్తుల పైన జిఎస్టి బారాలు మోపటం తగదన్నారు, రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ, రైతులకు సంవత్సర ఆదాయం రూ.8300 మాత్రమే వస్తుందని నిపుణులు చెప్పిన విషయం గమనించాలన్నారు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు బిగించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, రైతుల పంటలను ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, ప్రజాసంఘాల నాయకులు కాకుమాను నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సమావేశంలో గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించడానికి, ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని తీర్మానం, అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించామని తెలిపారు. నాయకులు దొప్పలపూడి రమేష్ మాట్లాడుతూ 19న జరిగే రైతు సదస్సులో 29 రాష్ట్రాలకు చెందిన రైతు సంఘం జాతీయ నాయకులు పాల్గొంటారని, ఢిల్లీలో జరిగిన రైతాంగ పోరాట స్ఫూర్తిని వివరిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కుర్రా హరిబాబు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కొత్త శివ నాగేశ్వరరావు, మద్దూరి రమణ, చుక్క యానాదులు, కొత్త వెంకటశివరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుగ్గిరాల

అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా "వ్యవసాయ రంగ సంక్షోభం- మద్దతు ధరల చట్టం- ప్రభుత్వ విధానాలు" అనే అంశంపై జరిగే రాష్ట్ర సెమినార్ ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం దుగ్గిరాల మండలంలో విస్తృతంగా మైకు ప్రచారం నిర్వహించారు. దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు దగ్గర ప్రచార జాతను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ప్రారంభిస్తూ ఢిల్లీ కేంద్రంగా 13 నెలలు సాగిన దేశవ్యాప్త రైతాంగ ఉద్యమం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మెడల వంచి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయించిన ఘనత కిసాన్ సంయుక్త మోర్చాదేనని తెలిపారు. వ్యవసాయ రంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతుందని రైతుల పరిస్థితి మరింత క్షీణిస్తుందని అన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ఇస్తామని హామీ ఇచ్చి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వాగ్దానాలు గాలికి వదిలేసిందని విమర్శించారు. జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా జరిగే సెమినార్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ జాత దుగ్గిరాల, ఈమని, చుక్క పల్లెవారిపాలెం, పెద్దపాలెం, వీర్లపాలెం, పెరకలపూడి, పెదకొండూరు, శంగారపురం, రేవేంద్రపాడు, తుమ్మపూడి, చిలువూరు, కంఠంరాజు కొండూరు, మంచికలపూడి, పెనుమూలి గ్రామాలలో ప్రచారం చేసింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు రైతు సంఘం దుగ్గిరాల మండల అధ్యక్ష కార్యదర్శులు వై .బ్రహ్మేశ్వర రావు ఎన్. యోగేశ్వరరావు ఉపాధ్యక్షులు వి .సాంబశివరావు, కౌలు రైతు సంఘం దుగ్గిరాల మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం. నాగమల్లేశ్వరరావు, బి. అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



పెదనందిపాడులో విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు



దుగ్గిరాల మండలంలో ప్రచారంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

తాడికొండ : రాష్ట్ర సెమినార్ ను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివ శంకర్ కోరారు. మండలంలోని నిడుముక్కల, మోతడక, పొన్నెకల్లు, బడేపురం,తాడికొండ గ్రామాలలో ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు ధరలు పెంచి ఆహార ధాన్యాల పైన పాల ప్యాకెట్లపై కేంద్రం జిఎస్టి బారాలు వేసిందని అన్నారు.రైతాంగం ఎదురుకుంటున్న సమస్యలపై రాష్ట్ర సెమినార్లో మండలంలోని రైతులు,రైతు కూలీలు పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కనగాల పూర్ణచంద్రరావు, చింతల భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

కొల్లిపర :రాష్ట్ర సదస్సులో మండలంలోని రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని కొల్లిపర మున్నంగి వల్లభాపురం పిడపర్రు పెడపర్తి పాలెం గ్రామాల పర్యటించి రైతులకు కౌలు రైతులకు కరపత్రాల అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి బాలరాజు, తీయగూర కృష్ణారెడ్డి లంకి రెడ్డి సుబ్బారెడ్డి కొండా శివ నాగిరెడ్డి దేవ సహాయం జంగా ప్రభాకర్ రెడ్డి అత్తోటవీరయ్య రైతులు పాల్గొన్నారు.



తాడికొండలో ప్రచారం



కొల్లిపర మండలంలో..

తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద

నేటి నుండి పారిశుధ్య కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని 29 గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పని భద్రత కల్పించాలని, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోకి తీసుకోవాలని మూడు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లుగా రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, అధ్యక్ష , కార్యదర్శులు చెరుకూరి సుశీల, రాచూరి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. రాజధానిలోని 29 గ్రామాల నుండి పారిశుధ్య కార్మికులునిరాహార దీక్షలో పాల్గొంటారని వారు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

అసెంబ్లీ, సచివాలయంలో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం మల్కాపురం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరములుగా అసెంబ్లీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా జీతాల చెల్లింపు తదితర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలని, కార్మికులు దుస్తులు మార్చుకోవడం, అనారోగ్యానికి గురైతే విశ్రాంతి కోసం ప్రత్యేక గదిని కేటాయించాలని, పెండింగ్ జీతాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మల్కాపురం వద్ద నిరసన తెలుపుతున్న రాజధాని పారిశుధ్య కార్మికులు, మాట్లాడుతున్న ఎం.భాగ్యరాజు



పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా

ప్రజాశక్తి-గుంటూరు : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. గురువారం స్థానిక మెడికల్ కాలేజి ప్రాంగణంలోని ఎపిజిఇఎ కార్యాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా పెన్షనర్ల కార్యవర్గ సమావేశంలో చాంద్‌భాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్లకు అన్ని ప్రభుత్వ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నగదు రహిత చికిత్స అందించాలని, పెండింగ్లో ఉన్న సరెండర్ లివ్ బిల్లులను, జిపిఎఫ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డిఎలపై స్పందించకుంటే ఏప్రిల్ లో జరగబోయే ఆందోళనకు సిద్ధం కావాలని ఉద్యోగులకు, పెన్షనర్లకు పిలుపునిచ్చినారు. సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పి.కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్,మత్తయ్య, హనుమంతరావు, రామారావు పాల్గొన్నారు.

భవనంపై నుండి పడి వాచ్‌మెన్ మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : బహుళంతస్తు భవనంలో పై అంతస్తు నుండి కిందంస్తుపై పడి వాచ్‌మెన్ మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం సత్తకోడుకు చెందిన మాకం బాబు (45) మంగళగిరిలోని బైపాస్ పక్కనున్న ఓ బహుళంతస్తుల భవనంలో 9 నెలలు నుండి వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన భార్యా, ఇద్దరు పిల్లతో అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇదే భవనంలో ఉన్నత విద్య మండలి రాష్ట్ర కార్యాలయమూ ఉంది. ఈ క్రమంలో ప్రతిరోజూ మాదిరే గురువారం తెల్లవారుజామునా ఊడవడం కోసమని భవనం పైకి బాబు వెళ్లాడు. కొద్దిసేపటికీ రెండో అంతస్తులో పడి అక్కడికక్కడే చనిపోయాడు. ఘటనా స్థలిని సిఐ బి.అంకమ్మరావు, ఎస్ఐ మహేంద్ర పరిశీలించి కేసు నమోదు చేశారు. తరచూ మద్యం తాగే అలవాటున్న బాబు మద్యం తాగే భవనంపైకి వెళ్లి ఉంటాడని, ఆ మత్తులోనే పైనుండి పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

ఏ రాజకీయపార్టీకీ చెందిన వాడిని కాదు

రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఎఎన్‌యు : రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్నతాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వాడిని కాదని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా ఈనెల 11 నుంచి 13వరకు 6వ ఏపి రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలో అధికమొత్తంలో నిధులు సేకరించి వాటిని దుర్వినియోగం చేశారని వచ్చిన ఆరోపణలపై బొప్పరాజు స్పందించారు. గురువారం వర్సిటీకి వచ్చిన ఆయన విసి ఆచార్య రాజశేఖర్, రెక్టార్ ఆచార్య వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బండి కరుణ, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి. జూన్సన్ లను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీలో క్రీడల నిర్వహణకు అవకాశం ఇచ్చినందుకు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణల గురించి మాట్లాడుతు క్రీడల నిర్వహణకు వచ్చిన డొనేషన్లకు ప్రతీ ఒక్కదానికి లెక్క ఉందన్నారు. తాను ఏ రాజకీయ పార్టీ మనిషిని కాదని, ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు వారి దష్టికి తీసుకెళ్తున్నానన్నారు. తనపై ఆరోపణలు చేసిన వ్యక్తిని అసోసియేషన్ నుంచి బహిష్కరించామని ఆ ఆవేదనతోనే ఇటువంటి వి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ పైసాకు లెక్క ఉంటుందని, ఆడిట్ చేపిస్తున్నామని లెక్కల్లో తేడాలుంటే ప్రభుత్వమే చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో కార్యదర్శి చేబ్రోలు కష్ణమూర్తి, ఉపాధ్యక్షులు ఆర్. రాజష్, గుంటూరు జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, కనపర్తి సంగీతరావు, ఎస్. మల్లీశ్వరరావు, పెంచెల రెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి- ముప్పాళ్ల

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో మొక్కజొన్న పంట యాజమాన్యంపై రైతులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం లాం శాస్త్రవేత్తలు డాక్టర్ నగేష్, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు. డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ మొక్కజొన్న విత్త నం వేసే ముందు తప్పనిసరిగా ఫోర్టెంజాదేవో మం దుతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల 20 నుంచి 30 రోజుల వరకు కత్తెరపురుగు, కాండం తొలుచు పురుగు నుంచి పంటను కాపాడు కోవచ్చని తెలిపారు. డాక్టర్ నగేష్ మాట్లాడుతూ మొక్కజొన్న వేసే ముందు రైతులు దుక్కిలో సింగల్ సూపర్ ఫాస్ఫేట్ నాలుగు బస్తాలు ,అరకట్ట పొటాష్, అలాగే, పంటకాలం మొత్తంలో యూరియా ఐదు బస్తాలు మించకుండా మూడు దఫాలలో చెండు వచ్చే వరకు వేసు కోవాలని సూచించారు. ఆఖరి దఫాలో ఒక కట్ట పొటాష్, ఒక కట్ట యూరియా వేస్తే సరిపోతుందన్నారు. పైన చెప్పిన విధంగా ఎరువులు వేస్తే కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా ఉపయోగించే అవసరం ఉండదని, ఎక్కువగా భాస్వరం వాడితే సూక్ష్మపోషక లోపాలు కనిపిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ విఎఎలు, విహెచ్ఎలు, రైతులు పాల్గొన్నారు.

మిర్చిలో తెగుళ్లపై అవగాహన

మండల ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మండలంలోని దమ్మాలపాడు,తొండపి,మాదల గ్రామాల్లో మిరప రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారిణి సిహెచ్ జననీ పాల్గొన్నారు. ముందుగా గ్రామాల్లోని మిరప పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మిరపపంటలో తెగుళ్ళు,రసంపీల్చే పురుగు ఆశించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏ విధమైన పద్ధతులు, క్రిమి సంహారక మందులు వాడితే పురుగు ఉధృతి తగ్గుతుందో రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణం చల్లగా ఉండడం వలన పంటలో ఆశించే నల్ల తామరపురుగు,వేరుకుళ్ళు, ఎండు తెగుళ్ళ నివారణ చర్యల పైనా పలు సూచనలు చేశారు. గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు వెంకటేశ్వర్లు, రాజేష్, నరేష్ పాల్గొన్నారు



మొక్కజొన్న పంట యాజమాన్యంపై రైతులకు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న లాం శాస్త్రవేత్త



మిరప రైతులకు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారిణి సిహెచ్ జననీ

వైసిపి పల్నాడు జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన

.ప్రజాశక్తి - నరసరావుపేట

లింగంగుంట్లలో కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయాలకు సమీపంలోని ఎన్నెస్పీ కాలనీలో నిర్మించనున్న వైసిపి పల్నాడు జిల్లా కార్యాలయానికి గురువారం ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావు పేటలో వైసిపి జిల్లా కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమన్నారు.మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన గడప గడపకు కార్యక్రమంతో ప్రజలకు మరింత దగ్గరయ్యామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపిపిలు, జెడ్పీ టీసీలు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి రజిని, ఎంపి, ఎమ్మెల్యేలు

'గడప గడపకు'లో మంత్రి రజిని

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 8వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరి గింది. కార్యక్రమంలో వైద్యా రోగ్య శాఖ మంత్రి రజిని పాల్గొన్నారు. సంక్షేమ పథకాల గురించి ఇంటి ఇంటికి తిరిగి మంత్రి వివరించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 8వ వార్డులో నూత నంగా నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు.

సంక్షేమ పథకాలే మళ్ళీ గెలిపిస్తాయి : ఎమ్మెల్యే గోపిరెడ్డి

ప్రజాశక్తి- నరసరావుపేట

నేరుగా ప్రజలకు చేరువవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలే వైసిపికి మళ్ళీ పట్టం కడతాయని, తమ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పట్టణంలోని 3వ వార్డులోని నిమ్మతోటలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కరపత్రాలను పంపిణీ చేశారు.

యువకుడిపై దాడి..

ప్రజాశక్తి - నకరికల్లు

తాగిన మైకంలో ఇరు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న సంఘటన నకరికల్లులో చోటుచేసుకుంది. సత్తెనపల్లి డిఎస్పి విజయభాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12న స్థానిక ఎన్ఎస్‌పి కాలనీలోని పైలాన్ వద్ద అగ్రవర్ణాలకు చెందిన ఒక కులం యువకులు, ఎస్టీ కులానికి చెందిన కొంతమంది యువ కులు మద్యం సేవిస్తున్నారు. తాగిన మైకంలో ఇరు వర్గాల మధ్య మాటామాట పెరగడం వారి మధ్య ఘర్షణకు దారితీసింది. దెబ్బలు తిన్న అగ్రవర్ణాల యువకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్ ఇరు వర్గాల పెద్దలను పిలిపించి యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయితే, గురువారం ఉదయం బొడ్డురాయి సెంటర్‌లో కూర్చొని ఉన్న యువకుడు బండి మణికంఠ పై ఎస్టీ కాలనీకు చెందిన వారు దాడి చేశారు. ఈ క్రమంలో అగ్రవర్ణాల యువకులు గంగమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. పోలీసులు అప్రమత్తమై అక్కడి నుంచి వారందరిని పంపించి వేశారు.

ఇరు గ్రూపుల వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి, గొడవలు జరగకుండా చూస్తామని డిఎస్పి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. డిఎస్పి వెంట రూరల్ సిఐ ఉమేష్, ముప్పాళ్ళ ఎస్ఐ పట్టాభిరామయ్య, రాజుపాలెం ఎస్సై మహ్మద్ షఫీ ఉన్నారు.

గతంలో ఖననం చేసినదై ఉండొచ్చు..

నదిలో అస్థిపంజరంపై సిఐ వివరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రైల్వే వంతెన సమీపంలో ఇసుక తిన్నెలపై కనిపించిన మానవ అస్థిపంజరం హిందువులు ఖననం/దహనం చేసే ప్రాంతం. ఇక్కడ వారి వారి సంప్రదాయాలు ప్రకారం....ఆ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. కాగా గత రెండు నెలల కు పైగా కృష్ణా నది వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో గతంలో ఖననం చేసిన మృతదేహంకు సంబంధించిన అస్థిపంజరం బైట పడి ఉండవచ్చునని స్మశానం వద్ద పని చేసే కాటి కారులు తెలిపినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

వేములూరిపాడులో మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-ఫిరంగిపురం:స్థానిక వేములూరుపాడు బస్టాండ్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ బొమ్మ దగ్గరలో మీనాబాద్ గ్రామానికి చెందిన కేతావత్ రవి నాయక్ మద్యం సీసాలు అమ్ముతుండగా పోలీసులు అరెస్టు చేశారు.ఎలాంటి అనుమతులు, బిల్లులు లేకుండా మద్యం సీసాలు అమ్ము తుండగా ఎస్సై శ్రీలక్ష్మీనారాయణరెడ్డి తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. 11 క్వార్టర్ మద్యం సీసాలను సీజ్ చేసి అతనిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

అమీనాబాద్ సర్పంచ్ భర్తపై కేసు

ప్రజాశక్తి-ఫిరంగిపురం : అమీనాబాద్ సర్పంచి భర్తపై కేసు నమోదు చేసినట్లు ఫిరంగిపురం ఎస్ఐ శ్రీలక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారంఅమీనాబాద్ గ్రామస్తుడు పిల్లుట్ల బాబురావు గ్రామ సమస్యలపై ఆర్టిఐ యాక్ట్ ద్వారా ప్రభుత్వ అధికారులను సమాచారం అడుగుతూ ఉంటాడు. ఈ క్రమంలో అమీనాబాద్‌లో దోమల బెడద ఎక్కువగా ఉందని పంచాయతి వారిని స్పందన ద్వారా సమాచారం అడిగారు. ఈ విషయమై ఈ నెల 10న వేములూరిపాడు సచివాలయంలో సర్పంచి గది వద్ద బాబురావుకు, సర్పంచి భర్త ఆనంద్ కు వాదన జరిగింది. ఈక్రమంలో బాబురావును ఆనంద్ కొట్టి బెదిరించారని, బాబురావు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినట్లు జిజిహెచ్, గుంటూరు నుండి వచ్చిన స్టేట్మెంట్‌ను కోర్టు అనుమతి పొంది కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమాజం-విద్యారంగం-ఉపాధ్యాయుల పాత్ర అంశపై 20న సదస్సు

ప్రజాశక్తి-తెనాలి: ఈ నెల 20న స్థానిక కవివరాజా పార్కులోని విజికె భవన్‌లో సాయంత్రం 4 గంటలకు 'సమాజం- విద్యారంగం-ఉపాధ్యాయుల పాత్ర' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నాస్తిక సమాజం తెనాలి శాఖ కార్యదర్శి ఆర్.శివకృష్ణ గురువారం చెప్పారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత పాలడుగు వెంకట్రామయ్య ప్రధమ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఅండ్‌టి నాయకులు డిఎస్ఎస్, నాస్తిక సమాజం అధ్యక్షులు ఎన్.నారాయణరావు, గౌరవాధ్యక్షులు కె.బెన్హర్ పాల్గొన్నారు.

ఓర్వలేక విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎటువంటి రాజకీయ సిఫార్సులకూ తావులేకుండా రాష్ట్రంలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే ఓర్వలేక టిడిపి,జనసేన ప్రభుత్వంపై బురద జల్లే విధంగా దుష్ప్రచారం చేస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గతంలో ఇంటి స్థలం కావాలంటే రోజుల తరబడి రోడ్లపై అనేక రూపాల్లో పోరాడాల్సి వచ్చేదనీ ఇప్పుడా పరిస్థితి లేకుండా దరఖాస్తు చేసిన మూడు నెలల్లో ఇళ్ల స్థలాలు ఇస్తు న్నామని తెలిపారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తుంటే పవన్ తన రాజకీయ స్వార్ధం కోసం విమర్శలు చేస్తు న్నారని మహాత్మా గాంధీ కళాశాల వ్యవస్థాపకులు డిఎఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 'పేదల ఇళ్ళు - రాజకీయ సవాళ్ళు' అనే అంశంపై ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని ఎన్‌జీజీవో హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆంధ్ర రాష్ట్ర ప్రజా పార్టీ వ్యవస్థాపకుడు జి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు రంగాలకు చెందిన మేధావులు తదితరులు టిడిపి, జనసేన తీరుపై విమర్శలు చేశారు.



'మాచర్లలో అవినీతి, అక్రమాలు నిజం కావా?'

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో ఇసుక, బియ్యం, మద్యం మాఫియా, భూ కబ్జాలు నిజం కావా అని తెలుగుదేశం పార్టీ నాయకులు పి.అంజయ్య, వైసిపి నాయకులను ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు గురువారం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం పేదలకు సక్రమంగా పంచుతున్నారా, పేదల దగ్గర తక్కువ ధరకు కొని మీరు ఎక్కువ ధరకు అమ్ముకోవటం లేదా అని ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో బెల్టు షాపులు పెట్టి అధిక ధరలకు మద్యం విక్రయిస్తు దోచుకోవటం లేదా, అధికారులను అడ్డుపెట్టుకొని ప్రతి పనికి డబ్బులు వసూలు చేయటం లేదా ఇసుక మాఫియా వారికి వరంగా మారిందన్నారు. పలువురు మండల స్థాయి నాయకులు మాట్లాడుతూ జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రజాదరణ లేని నాయకుడు కాదని అన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని, అలా చేస్తే ఇకపై రహదారులపై నేరుగా నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. సాగర్ విమానాశ్రయం వద్ద భూములు ఆక్రమించి దాని చుట్టు ప్రహరీ నిర్మించలేదా అని ఆరోపించారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తోన్న ప్రభుత్వం

ప్రజాశక్తి- నరసరావుపేట

పత్రికా స్వేచ్ఛను వైసిపి ప్రభుత్వం కాలరాస్తోందని, విలేకరులకు కనీసం అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు కూడా ఇవ్వలేక పోయారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు విమర్శించారు. స్థానిక పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ కోవిడ్‌తో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి హయాంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను రద్దు చేశారని విమర్శించారు. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ టిడిపి అధి కారంలోకి రాగానే వారికి అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇన్సురెన్సులు, ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి జి.జనార్ధన్ బాబు, రాష్ట్ర మైనార్టి సెల్ అధికార ప్రతినిధి మన్నన్ షరీఫ్, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ డిఎ బకాయిల విడుదలకు డిమాండ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిలకలూరిపేట మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం పూర్తి చేసినట్లు రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ కె.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఎస్ టియు కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూ ల్ వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ డిఎ బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్ లో ఉన్న రెండు డిఎలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా పెండింగ్‌లో మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు డీడీవో అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యుత్ వినియోగదారుల సమావేశం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి గురువారం తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను, సూచనలను సమావేశంలో తెలియజేయవచ్చునన్నారు.

ఆర్‌టిసి ఆవరణలో స్టాల్స్‌కు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ పరిధిలోని స్టాల్స్‌కు అద్దెకు ఇచ్చేందుకు టెండర్ల ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ గురువారం తెలిపారు. బస్టాండ్, పరిసరాల్లో ఉన్న 30 స్టాల్స్ అద్దెకిచ్చే ప్రతిపాదన ఉందని, ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తులో తమ వ్యాపారాన్ని కూడా పొందుపరిచవచ్చున్నారు. వివరాలకు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా కోరారు.

మాజీ కౌన్సిలర్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి - తాడేపల్లి


జమతున్నీసా (ఫైల్)

తాడేపల్లి పురపాలక సంఘంలో 13వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన ఎమ్‌డి.గోరెబాబు తల్లి జమతున్నీసా (82) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. జమతున్నీసా మృతదేహాన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తపరిచారు.



250 మందికి భోజనాలు

ప్రజాశక్తి - తాడేపల్లి

షంషాబాద్ రామానుజ సహస్రాబ్ది సమారోహంలో భాగంగా వివిధ విభాగాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న 250 మంది గురువారం విజయకీలాద్రి దివ్యక్షేత్రానికి వచ్చారు. వీరికి జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు భోజనాలు తదితర ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసచార్య స్వామి, మధుసూధనాచార్యస్వామి, రఘునాధాచార్యస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- మంగళగిరి

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిచాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో పాత బస్టాండ్ సెంటర్లో నిర్మాణం జరుగుతున్న వైఎస్ఆర్ చేనేత భవన్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగాస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంటిఎంసికి ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థకు ఎన్నికల నిర్వహించాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు చల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన జనసేన కార్పొరేషన్ కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సమావేశానికి ఎం ఈ.మారుతిరావు అధ్యక్ష వహించారు. కార్పొరేషన్‌కు ఎన్నికల పెట్టకపోవడం వలన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కార్పొరేషన్‌కు ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బి విజయ శేఖర్, వాస శ్రీనివాసరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు


ప్రాంతీయ గ్రంథాలయంలో..

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గుంటూరు, ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, స్వాతంత్ర్యం కాపాడుకోవటంలో విద్యార్థుల పాత్ర, వ్యాసరచన పోటీలు, గ్రంథాలయాలపై ఇంటర్నెట్ ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఈనెల 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతి ప్రధానం చేస్తామని గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.



జెకెసీలో..

జెకెసిలో వ్యాసరచన..

స్థానిక జెకెసి కాలేజిలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని 'ఆధునిక సమాజంలో నేటి గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధికి, మనోవికాసానికి గ్రంథాలయాలు మూలమని, భవిష్యత్‌కు దారి చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ ప్రసంగించారు. అధ్యాపకురాలు పి.నాగసుశీల, డాక్టర్ వై.ప్రశాంతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, గ్రంథాలయాధికారి చెరుకూరి నాగభవానీ పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం, రచయితలు సందేశాలు నిర్వహించారు. విద్యార్థులకు అన్నమయ్య కీర్తనలు, సంగీత పోటీలు జరిగాయి. ఎం.రమణ పర్యవేక్షణలో సంగీత పోటీలు జరిగాయి. గ్రంథాలయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవో 27ను సవరించి పిఆర్‌సిని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-మంగళగిరి

జిఓ నెంబర్ 27ను సవరించి పిఆర్‌సిని పునరుద్ధరించాలని ఏపి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సర్వీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎపిసిఒఎస్ఇఎ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.మణికాంత్, ఎల్.కరుణాకర రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకర్లతో వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఎస్‌పీహెచ్‌ఏ (ఎం), ఏఎన్ఎం, ఎల్‌టి ఫార్మాసిస్ట్, స్టాఫ్‌పర్స్‌ల బదిలీల ఆశ నెరవేర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నూరు శాతం విజయం దిశగా నడిపించేందుకు తమ వంతు కషి చేస్తామన్నారు. జీవో నెంబర్ 27 సవరణ కోసం తాము ఎదురుచూపులు చూస్తున్నామని సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహదయంతో స్పందించి ఆ జీవోను సవరించి పిఆర్సి ని పునరుద్ధరించాలని కోరారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అర్హతలు కలిగిన ఉద్యోగులను రేగులరైజ్ చేయాలని వారు కోరారు. సమావేశంలో కోశాధికారి ఎస్ రమేష్ పాల్గొన్నారు.

సుంకర శ్రీనివాసన్‌కు అభినందనల వెల్లువ


సుంకర శ్రీనివాసన్‌కు అభినందనలు తెలుపుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి -మంగళగిరి

జీడీసీసీ బ్యాంక్ మంగళగిరి శాఖలో మేనేజర్‌గా పని చేస్తూ ప్రమోషన్‌పై దుగ్గిరాల బ్రాంచ్ చీఫ్ మేనేజర్‌గా వెళుతున్న సుంకర శ్రీనివాసన్‌ను గురువారం వివిధ సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు అభినందించారు. ముఖ్య అతిథిగా మంగళగిరి పీఏసీఎస్ అధ్యక్షులు పల్నాటి నాగేశ్వరరావు హాజరై మేనేజర్ శ్రీనివాసన్‌ను ఘనంగా సత్కరించి మాట్లాడారు. 2018లో శ్రీనివాసన్ బాధ్యతలు చేపట్టిన నాటికి మంగళగిరి బ్రాంచి రూ.42 కోట్లు టర్నవర్ ఉండగా, నాలుగేళ్లలో సుమారు రూ.135 కోట్ల టర్నవర్ సాధించిందన్నారు. శ్రీనివాసన్ రైతులకు ఖాతాదారులకు దగ్గరై సేవలందిస్తూ మంచి పేరు సంపాదించారన్నారు. మంగళగిరి పీఏసీఎస్‌కు రూ.45 కోట్లు, నూతక్కికి రూ.25 కోట్లు, యర్రబాలెంకు రూ.20 కోట్లు, కురగల్లుకు రూ.25 కోట్లు, డ్వాక్రా రుణాలు రూ.15 కోట్లు, చేనేత సహకార సంఘాలకు రూ.4 కోట్లు రుణాలు మంజూరు చేసి రైతులు, చేనేత కార్మికులు, డ్వాక్రా మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో కురగల్లు పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, వివిధ సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు ఉడత శ్రీనివాసరావు, పి.శివశంకరరావు, డి.మోహన్, కిషోర్, జి.సోములు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఇతర నైపుణ్యాలూ అవసరం



మాట్లాడుతున్న ఆర్‌కె. సింగ్

ప్రజాశక్తి -మంగళగిరి

విద్యార్థులకు చదువుతో పాటు ఇతర నైపుణ్యాలు ఎంతో అవరమని సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ టి. ఆర్‌కె.సింగ్ తెలిపారు. గురువారం రోటరీ క్లబ్ మంగళగిరి ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలు సందర్భంగా స్థానిక వీటిజెయం డిగ్రీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్ మీద వర్క్ షాప్ జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను, పోటీ తత్వాన్ని ఎదుర్కునేలా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఇంటర్వ్యూ ఎలా ఫేస్ చేయాలి ,మనకి ఎదురయ్యే ప్రశ్నల, వారికి మనం చెప్పాల్సిన సమాధానాలు,సివి ఎలా రాయాలి అనే విషయాలు పై శ్రద్ధ చూపాలని అవే మన గురించి తెలియజేసే ప్రథమ సాధనమని పిల్లలందరూ వీటిపై దృష్టి పెట్టి నేర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణంలోని విజె కళాశాల,నిర్మల డిగ్రీ కాలేజ్, విటిజెఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు సుమారు 300 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షులు త్రిపురమల్లు సతీష్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో క్లబ్ ట్రైనర్ ఇ. అనిల్ చక్రవర్తి, న్యూ జనరేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణ, జి.బిక్షారావు, వి.శ్రీనివాసరావు, వి.వెంకటప్రసాద్ ,పి.రాజశేఖర్,ట్రెజరర్ జి. శ్రీనివాసరావు, డి. శ్రీనివాసరావు , ఆర్. ధనలక్షిలు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న విద్యాశాఖాధికారి రుద్రపాటి శోభచంద్

పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

మండలంలోని వడ్డీముక్కల గ్రామంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పొన్నూరు మండల విద్యాశాఖధికారి రుద్రపాటి శోభచంద్ తనిఖీలు నిర్వహించారు. అనంతరం పిల్లలతో కలసి భోజనం చేశారు. భోజనం చాలా బాగుంది అని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.


సాంబశివరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

సాంబశివరావుకు పలువురు నివాళి

ప్రజాశక్తి-తెనాలి

ఇటీవల మృతి చెందిన జిడిసిసి బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి అమిరినేని సాంబశివరావుకు పలువురు నివాళులర్పించారు. స్థానిక జెఎంజే కళాశాల వద్ద గల ఆయన నివాసంలో సాంబశివరావు సంస్మరణ సభను కుటుంబ సభ్యులు గురువారం నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. సాంబశివరావు ఎంతో సేవా భావం కలిగిన వ్యక్తని కొనియాడారు. సాంబశివరావు కుమారుడు అమిరినేని ప్రసాద్‌ను ప్రవాసభారతీయులు వెంకటేశ్వర్లు, ఏపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కె.రత్నాకర్, తెనాలి, వేమూరు నియోజకవర్గ అద్యక్షులు ఎ.శ్యామ్‌సాగర్, ఎం.సుబ్బారావు, ప్రేమ్‌కుమార్ కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉషాకుమారి, శ్రీలత, శ్రీదేవి, మల్లిఖార్జునరావు, శ్రీధర్, మధుసూదనరావు, రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సునీతను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

బుర్రకథ కళాకారిణి గౌరీ సునీతకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో శకపురుషుని శతజయంతి పేరిట నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎన్‌టిఆర్ నటించిన సర్దార్ పాపారాయుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ఓ కళాకారుని సత్కరిస్తున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన బుర్రకథ, హరికథ కళాకారిణి తలకటూరి గౌరీ సునీతను సత్కరించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత మాట్లాడుతూ ఎన్‌టిఆర్ శతజయంతి పేరిట కళాకారులను సత్కరించటం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో సైకం సాయిలక్ష్మి, గడ్డిపాటి సీతాతర్నం, దేవరపల్లి భవాని, వేములవాడ సత్యవతి, పి.పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, అయినాల మల్లేశ్వరావు, జి.ప్రసాద్, ఎం.రాఘవరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై శ్రద్ధ చూపాలి : కమిషనర్


ఎక్స్‌గ్రేషియా చెక్ అందచేస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి విభాగాధిపతులను ఆదేశించారు. గురువారం జిఎంసిలోని ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి మీట్ ది కమిషనర్ ప్రోగ్రామ్‌ని కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించి, ఇటీవల మరణించిన కార్మికురాల కుటుంబ సభ్యులకు అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి ఎక్స్గ్రేషియా చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్దేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలని, గడువులోగా పరిష్కరించని అధికారులపై చర్యలు తప్పవన్నారు. కారుణ్య నియమాకాల్లో పారదర్శకత పాటించకుంటే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్మికులు కూడా తమకు అందే జీతాలు, ఇతర అలవెన్సులకు ఎవ్వరికీ ఎటువంటి నగదు ఇవ్వాల్సిన పని లేదని, ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే ప్రతి గురువారం జరిగే గ్రీవెన్స్‌లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం 15వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన బంగారు పార్వతి కుమారుడు శ్రీనుకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్ అందించారు.



మాట్లాడుతున్న అబ్దుల్ సలీం

మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యల పరిష్కారం కోసం

20, 21 తేదీల్లో చలో ఢిల్లీ

ప్రజాశక్తి-గుంటూరు : మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమస్యలు పరిష్కారాలకై ఆలిండియా ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుమేరకు 20,21 తేదీల్లో జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె. అబ్దుల్ సలీం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందుల ధరలు తగ్గించాలని, మందులపై జీఎస్‌టిని ఎత్తివేయాలని తదితర డిమాండ్లతో 20న జాతీయ స్థాయి కన్వెన్షన్ జరుగుతుందన్నారు. 21న డీల్లీలో ర్యాలీ ఉంటుందన్నారు. మెడికల్ రిప్రజెంటెటివ్స్‌కు పని పద్ధతులు రూపొందించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కేంద్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో తీసుకువచ్చిన లేబర్ కోడ్లును వెనక్కి తీసుకోవాలని, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్నటువంటి సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం-1976ను కాపాడాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా వేలాది మంది మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌తో ర్యాలీ జరుగుతుందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సుబ్బారావు, యం.హనుమంతరావు, జి. శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఫణీంద్ర , జిల్లా నాయకులు వి.శశిధర్, జి.అనిల్ కుమార్, ఎస్.మల్లికార్జునరావు,తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కుమార్‌కు లక్ష్మీనారాయణ స్మారక పురస్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ప్రముఖ సాహితీవేత్త, సినీవిమర్శకులు, విశ్లేషకులు కెపి అశోక్‌కుమార్‌కు సిహెచ్ లక్ష్మినారాయణ స్మారక సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 26న గుంటూరులోని బృందావన్ గార్డెన్‌లో జరిగే సాహితీ కార్యక్రమంలో కెపి అశోక్‌కుమార్‌కు ఈ పురస్కారంను అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయ్‌బాబు అందజేయనున్నట్లు ప్రొఫెసర్ సిహెచ్ సుశీలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన వారికి ఈ పురష్కారంతో గౌరవిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఈ పురస్కారంతో కడియాల రామ్మోహన్ రాయ్, ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డిలను సత్కరించినట్లు తెలిపారు. కెపి అశోక్‌కుమార్ కథావలోకనం, తెలుగునవల - వస్తు వైవిధ్యం, కథానుశీలం విమర్శ గ్రంధాలు, దళిత గీతాలు, ఎనిమిదో అడుగు, జాంబపురాణం, నోబెల్ కవిత్వం అనే పుస్తకాలను రచించారు. పుస్తక రచనతోపాటు వెయ్యికి పైగా సినిమా సమీక్షలు, రెండువేలకు పైగా పుస్తక సమీక్షలను చేశారు. కార్యక్రమంలో విమర్శ వీక్షణం అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రొఫెసర్ సిహెచ్ సుశీలమ్మ కోరారు.

ప్రత్తిపాడు, పిడుగురాళ్లలో రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు, పిడుగురాళ్లలో వేర్వేరుగా విజిలెన్సు అధికారులు గురువారం రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వట్టిచెరుకూరు నుండి ప్రత్తిపాడుకు తరలిస్తున్న 100 బస్తాల బియ్యంను పట్టుకున్నారు. వేకువజామున అధికారులు నిఘావేసి రేషన్ బియ్యం అక్రమరవాణా చేస్తుండగా దాడి చేశారు. వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామము లోని శివకుమారి రేషన్ షాప్ నుండి ప్రత్తిపాడుకు చెందిన తన్నీరు నాగేశ్వర రావు బియ్యం తరలిస్తున్నట్టు డ్రైవర్ నవీన్ చెప్పినట్టు అధికారులు తెలిపారు. వట్టిచెరకూరు మండలం గారపాడు రేషన్ దుకాణం తనిఖీ చేయగా బియ్యం అక్రమంగా బయటకు తీసుకువెళ్లినట్టు గుర్తించారు. బియ్యం అక్రమ వ్యాపారంకు పాల్పడుతున్న రేషను డీలరు ఎం.శివకుమారి, తన్నీరు నాగేశ్వర రావు, వాహన యజమాని, డ్రైవర్ పైనా, నిత్యావసర సరుకుల చట్టం క్రింద 6-ఎ కింద కేసులు నమోదు చేయాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. ఈ దాడిలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఎ. శ్రీహరిరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రామచంద్రయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షైక్ సైదులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పిడుగురాళ్లలో పట్టణం జానపాడు రోడ్డులో నివాసం ఉంటున్న భవనం సైదయ్య రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చే స్తుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. జానపాడు రోడ్డు లోని గోడౌన్ తనిఖీ చెయ్యగా 80 బస్తాలు బియ్యం స్వాధీనం చేసుకున్నారు. సైదయ్యను విచారించగా 80 బస్తాలు పిడుగురాళ్ళ పరిసర ప్రాంతాలు, తెలంగాణా నుండి కొనుగోలు చేసినట్లు చెప్పాడు. బోనం సైదయ్యపై కేసు నమోదు చేశామని విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు.


ప్రత్తిపాడులో అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రుణ యాప్‌ల జోలికి వెళ్లద్దు

- అనధికారిక చిట్‌లు తీసుకోకండి
- నేరాల నిరోధానికి చర్యలు చేపట్టండి
- డిఐజి త్రివిక్రమవర్మ
- తూర్పు డిఎస్‌పి కార్యాలయం, అరండల్‌పేట స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వార్షిక తనిఖీల్లో భాగంగా గుంటూరు రేంజ్ డి.ఐ.జి డాక్టర్ త్రివిక్రమ వర్మ గురువారం అరండల్ పేట పోలీసు స్టేషన్, తూర్పు డిఎస్‌పి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అరండల్‌పేట, లాలాపేట పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. తూర్పు సబ్ డివిజన్ ఆఫీస్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, ఈస్ట్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ లలో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్ మరియు వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఈస్ట్ డివిజన్ ఆఫీస్ పరిసరాలను, రిసెప్షన్ కౌంటర్ రిజిస్టర్లను మరియు కంప్యూటర్ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా దర్యాప్తు పూర్తయిన కీలకమైన కేసులలో నిందితులకు శిక్ష పడే విధంగా కోర్టు లో చార్జి షీటు ఫైలు చేయాలని అధికారులకు సూచించారు. లైసెన్స్ లేకుండా చిట్టి వ్యాపారాలు చేసి వారిని నమ్మొద్దని అత్యాశకు పోయి మోసపోవద్దని డిఐజి ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ మొబైల్ కి సంబంధించిన డేటాను దొంగిలించే అనధికార యాప్‌ల జోలికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్ళొద్దు అని, సులువుగా రుణాలు ఇస్తున్నారన్న రుణ యాప్‌లకు ఆకర్షితులవ్వద్దని కోరారు. మిస్సింగ్ కేసులను పరిశీలించి టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించాలని ఆదేశాలు జారీచేశారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్ తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించారు. రైల్వే ఉద్యోగాలు, పోస్టు ఆఫీసు డిపార్ట్మెంట్ ఉద్యోగాలు అమెజాన్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారని వీరి మాటలకు ప్రజలు మోసపోవద్దని కోరారు. వార్డు మహిళా పోలీసులు పనిచేస్తున్న సచివాలయాల పరిధిలో ఉన్నా పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని అన్నారు. మిస్సింగ్ కేసులు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. ఆస్తి దొంగతనాలను నిరోధించాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. ఇతర విభాగాలతో కలసి బ్లాక్ స్పాట్స్ ను సందర్శించి ఆయా ప్రాంతాలలో వాహన చోదకులను అప్రమత్తం చేసే చర్యలు తీసుకోవాలి. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలు పిటీషనర్ల పట్ల మర్యాదగా, జవాబుదారీగా వ్యవహరించాలని. సివిల్ పంచాయతీలలో తలదూర్చి క్రమశిక్షణారహితంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్ ,ఈస్ట్ డివిజన్ డి ఎస్ పి సీతారామయ్య, సిఐలు సుబ్బారావు, శ్రీనివాసుల రెడ్డి, నరసింహారావు, వెస్ట్ ఇన్చార్జి డిఎస్ పి శ్రీనివాసరావు, అరండల్ పేట సి ఐ రామ నాయక్ పాల్గొన్నారు.


అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న డిఐజి త్రివిక్రమ్

మూర్ఛ వ్యాధిపై అవగాహన పెంచుకోండి

ప్రజారోగ్య వేదిక సభలో ప్రముఖ న్యూరో ఫిజీషియన్లు, సర్జన్లు - జిజిహెచ్ సదస్సులో డాక్టర్ సుందరాచారి



ప్రజారోగ్య వేదిక సభలో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు రమాతారక్‌నాథ్,డాక్టర్ పి విజయ


జిజిహెచ్ సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు సుందరాచారి

ప్రజాశక్తి-గుంటూరు

మూర్ఛ వ్యాధి ఉన్న రోగులు వైద్యుల సలహాలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగరం లోని ప్రముఖ నరముల వ్యాధి నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యంగా క్రమం తప్పకుండా మందులు వాడాలని, నిద్రపోయే సమయం క్రమబద్ధంగా ఉండేలా చూసుకొని, తగినంత నిద్రపోవాలని అన్నారు. గురువారం ప్రపంచ మూర్ఛ వ్యాధి అవగాహన దినం సందర్భంగా స్థానిక బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో, వేదిక ఉపాధ్యక్షులు డాక్టర్ గొంది శివరామకృష్ణ అధ్యక్షతన అవగాహన సభ నిర్వహించారు. ఈ సభలో నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ రమాతారక్ నాథ్, డాక్టర్ కుమారవేల్, డాక్టర్ పి.విజయ, డాక్టర్ యన్.శ్రీనివాసరావు, డాక్టర్ గంటా శ్రీనివాసరావు, డాక్టర్ హరితచౌదరి, డాక్టర్ హిమ బిందు, డాక్టర్ హనుమశ్రీనివాసరెడ్డి, డాక్టర్ గడ్డిపాటి చందన, డాక్టర్ యు అరుణకుమారి, డాక్టర్ బిందు నర్మద, డాక్టర్ నటరాజ్, డాక్టర్ వందనపు నవీన్, డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొని మూర్ఛ వ్యాధిపై సమగ్ర అవగాహన కల్పించారు. మూర్ఛ రోగులు డాక్టర్ సలహా లేకుండా మందుల మోతాదు తగ్గించటంగానీ, మార్చటంగానీ చేయకూడదని, పడుకోబోయే ముందు కెఫిన్, ఇతర ఉత్తేజపరిచే వాటిని తాగొద్దని తెలిపారు. మూర్ఛ వస్తుంటే వాహనాలు నడపవద్దని, మద్యం, నిషేధిత మందులు వినియోగించొద్దని, ఎత్తుగా ఉన్న ప్రదేశాలు, భారీ యంత్రాలు, విపరీతంగా వేడి, నీళ్లు ఉండే ప్రదేశాల్లో పనిచేయకూడదని, స్విమ్మింగ్ చేయకూడదని సూచించారు. ఈ వ్యాధికి ప్రథమ చికిత్స కూడా చేయొచ్చన్నారు. మూర్ఛ వచ్చిన వ్యక్తి చుట్టూ జనం గుమిగూడకుండా నిరోధించాలని, పేషెంట్ బట్టను లూజు చెయ్యాలని, ప్రత్యేకించి మెడచుట్టూ లూజుగా ఉండేటట్లు చూడాలని తెలిపారు. శ్వాస తీసుకోవటానికి సహాయ పడేందుకు, నోటిలోని నురగ బయటకు వచ్చేలా చేయటానికి రోగిని మెల్లగా పక్కకు తిప్పాలని, గాయం కలగకుండా ఉండేందుకు రోగి తలకింద దిండుగానీ, ఏదైనా మెత్తనిది పెట్టాలని వివరించారు. మూర్ఛ కలిగిన వ్యక్తి నోటిలో వస్తువు ఏదీ పెట్టకూడదని, మూర్ఛ వచ్చినప్పుడు రోగిని బలవంతంగా పట్టుకోవద్దని డాక్టర్లు సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎల్.ఎస్.భారవి, కోశాధికారి పి.ఎస్.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : మూర్ఛ వ్యాధి పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి న్యూరాలాజిస్టు విభాగం అధిపతి డాక్టర్ సుందరా చారి అన్నారు. గురువారం ఆసుపత్రి లోని న్యూరాలజస్ట్ సెమినార్ హాలు లో జరిగిన మూర్ఛ వ్యాధి దినోత్సవ కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. మూర్ఛ అనేది అంటు వ్యాధి కాదని డాక్టర్ సుందరాచారి అన్నారు. మూర్ఛ వచ్చినప్పుడు బలవంతంగా నీళ్లు తాగించకూడదు. నోట్లో నీరు పోయడం వల్ల ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. మూర్ఛ వచ్చినప్పుడు ఆ వ్యక్తి కదలికలను గమనించాలని ఆయన తెలిపారు. ఆ తర్వాత తాగడానికి తినడానికి పదార్ధన్ని అందించి పరిసర ప్రాంతం లో ఉన్న ఆసుపత్రికి పంపిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని ఆయన అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద మాట్లాడుతూ మూర్ఛ వచ్చిన వారు వివాహం చేసుకోవచ్చుఅన్నారు. మూర్ఛ వ్యాధి రావడానికి ప్రధాన కారణం మెదడులో లోపాలు ఉండటం కారణమన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.అరుణ కుమారి, పీజీ విద్యార్థులు నవీన్, గీత, యమున, అమర్, కార్తీక్ అజమా, కాంతిమ, ముబషీర్ పాల్గొన్నారు.



ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మూర్ఛవ్యాధిపై అవగాహన సభలో పాల్గొన్న నగరంలోని ప్రముఖ వైద్యులు